క్లుప్తంగా

వృత్తి విద్యపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మంగపతి

మందస: విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులపై కూడా దృష్టి సారించాలని పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు బర్ల త్రినాథ వెంకటమంగపతి అన్నారు. మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు ఆధ్వర్యంలో వృత్తి విద్యపై విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. ఇంటర్మీడియెట్‌లో ఒకేషనల్ గ్రూపులున్నాయని, వీటిలో విద్యార్థులు చేరి, సాంకేతిక విద్యను అభ్యసించాలన్నారు. వృత్తి విద్యతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి కోర్సులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాప నరేష్, దుర్యోధనజెన్నా, సీనియర్ అసిస్టెంట్ జి.ప్రవీణ్‌కుమార్, కె.వెంకటరావు, జి.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వర్ణాపురంలో విశ్వశాంతి యజ్ఞం



విశ్వశాంతి యజ్ఞం వద్ద వేద పండితులు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామమైన స్వర్ణాపురంలో రెండు రోజులుగా గ్రామస్తులు విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పండితుల వేద మంత్రాల నడుమ యజ్ఞ పూజలు జరిగాయి. లోక కల్యాణం కోసం, ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నదే యజ్ఞం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హరేరామ–హరేకృష్ణ నామ సంకీర్తనలు ఆలపించారు.

ఎస్‌జీఎఫ్ ఆర్థికసాయం



హేమసుందరరావుకు సాయం అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: ఆర్.బెలగాం గ్రామానికి చెందిన బొయిరిశెట్టి హేమసుందరరావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు నెలరోజులకు సరిపడా రేషన్ సరకులు, రూ.10,500 నగదును బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు.

తైక్వాండోతో మహిళలకు రక్షణ



బెల్ట్ టెస్టులో పాల్గొన్న చిన్నారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి తదితరులు

ఇచ్ఛాపురం: మహిళలు తైక్వాండో క్రీడను నేర్చుకోవడం ద్వారా ఆపద సమయంలో రక్షణగా ఉపయోగపడుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎస్సై గోవిందరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కల్యాణ మండపం ప్రాంగణంలో తైక్వాండో అభ్యసిస్తున్న చిన్నారులకు ఆదివారం బెల్ట్ టెస్టులు నిర్వహించారు. కోచ్ దుర్గాప్రసాద్, జిల్లా ప్రచారం విభాగ అధ్యక్షులు తాడి ఆదిరెడ్డి, కౌన్సిలర్లు సుగ్గుప్రేమ్‌కుమార్, కె.దిలీప్ పాల్గొన్నారు.

బాలికలు విద్యావంతులుగా ఎదగాలి

• టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి హరిత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి హరిత

టెక్కలి: బాలికలు విద్యావంతులుగా ఎదగాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. స్థానిక ఎస్టీ బాలికల మేనేజ్‌మెంట్ వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బాలికల కోసం కల్పించిన వివిధ రక్షణ చట్టాలపై అవగాహన చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, వివక్షత తదితర అంశాలపై పూర్తిస్థాయిలో చైతన్యం కలిగి ఉండాలని సూచించారు. బాలికలు విద్యావంతులుగా మారి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డెన్లు సునీత, పి.నేపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

శతశాతం 'ఉపాధి' లక్ష్యం



టెక్కలి మండలం సీతాపురం సమీపంలోని చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు

- టెక్కలి నియోజకవర్గంలో 31,600 మంది వేతనదారులకు పని కల్పనకు చర్యలు
- ప్రస్తుతం 17,527 మంది పనుల్లో నిమగ్నం
- 2,720 పనులు చేపట్టేందుకు ప్రణాళికలు

టెక్కలి: రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలు దాదాపు చివరి దశకు వచ్చాయి. వేసవి కూడా ఆరంభమైంది. దీంతో పలు గ్రామాల్లో కార్మికులు పనుల కోసం వలస వెళ్లే అవకాశం ఉంది. అయితే వలసలను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతి పంచాయతీలో ఆయా ప్రజలకు ఉపయోగకరమైన చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి, గ్రావెల్, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం తదితర పనులు చేపట్టి వేతనదారులకు స్థానికంగా ఉపాధి కల్పించనున్నారు. అవసరమైన కుటుంబాలకు పని కల్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి.

31,600 మందికి ఉపాధి లక్ష్యం

టెక్కలి నియోజకవర్గంలోని 136 పంచాయతీల్లో 31,600 మంది వేతనదారులకు పనులు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 17,527 మంది వేతనదారులు పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి పంచాయతీకి 20 పనుల చొప్పున మొత్తం 2,720 పనులు చేపట్టాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ప్రతి వేతనదారుడికి రోజుకు 257 రూపాయలు వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

మండలాల వారీగా చేయాల్సిన పనులు, వేతనదారులు, వెచ్చించే వ్యయం ఇలా..

- టెక్కలి మండలంలోని 27 పంచాయతీల్లో ఏడు వేల మందికి ఉపాధి కల్పించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ప్రతి పంచాయతీకి 20 పనుల చొప్పున 540 చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. మొత్తం పనులకు సంబంధించి రూ.28.82 కోట్లు వెచ్చించనున్నారు. ఇప్పటికే 3,489 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు.
- నందిగాం మండలంలోని 37 పంచాయతీల్లో 8,200 మందికి ఉపాధి కల్పించనున్నారు. 740 పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. రూ.26.60 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం 4,044 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు.
- కోటబొమ్మాళి మండలంలోని 38 పంచాయతీల్లో 8,800 మంది వేతనదారులకు పనులు కల్పించనున్నారు. 760 పనులు చేపట్టడం ద్వారా రూ.19 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రస్తుతం 5,916 మంది పనులకు హాజరవుతున్నారు.
- సంతబొమ్మాళి మండలంలోని 34 పంచాయతీల్లో 7,600 మందికి పనులు కల్పించనున్నారు. ప్రతి పంచాయతీకి 20 పనుల చొప్పున 680 పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. రూ.32.15 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే 4,078 మంది పనులకు హాజరవుతున్నారు.

వంద రోజులు పని కల్పించేందుకు చర్యలు

ఉపాధి హామీ పథకం చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు కలిగిన వారికి వంద రోజులు పని కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రతి పంచాయతీ పరిధిలో ఆయా ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం.

–బి.మురళీకృష్ణ, ఏపీడీ, ఉపాధి హామీ పథకం, టెక్కలి

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు

• జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు పని చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక సంస్థల అభ్యర్థి నర్తు రామారావు, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్ అధ్యక్షతన కవిటిలో విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీ సభ్యులు పలాసలో ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటు ఏ విధంగా వేయాలో అవగాహన కల్పించారు. ఎంపీపీ కడియాల పద్మ, సీడాప్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్లు సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, దుక్క లోకేశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, వైస్‌చైర్మన్ వై.నీలయ్య, పీఏసీఎస్ చైర్మన్ దేవరాజ్‌సాహూ, సీనియర్ నేతలు పి.ఎం.తిలక్, శ్యాంపురియా, జయప్రకాష్, పూడి లక్ష్మణరావు, జల్లు యుగంధర్, పి.నీలాచలం,డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రామారావు

• స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి రామారావు

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తనకు మద్దతు ఇవ్వాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నర్తు రామారావు ప్రజాప్రతినిధులను కోరారు. ఇచ్ఛాపురం పట్టణంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, వైస్ చైర్మన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, నాయకులు నర్తు నరేంద్ర, కె.మోహనరావు, కృషారౌలో, తిలక్, ప్రకాష్, పట్నాయక్ పాల్గొన్నారు.

చిన్నారికి అండగా..



వజ్రపుకొత్తూరు రూరల్: హర్షవర్ధన్‌కు సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: నందిగాం మండలం హరిదాసుపురం గ్రామానికి చెందిన చిన్నారి హర్షవర్ధన్ రెండు కాళ్లు చచ్చుపడడంతో కదల్లేని స్థితిలో మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న మైటీ హెల్పింగ్ ఫౌండేషన్ సభ్యులు చిన్నారికి ఆదివారం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కె.రాకేష్, కార్యదర్శి ఉప్పరపల్లి సతీష్, రెయ్యి నీలకంఠం, అఖిల్, విశాల్, షణ్ముఖ ఉన్నారు.



వజ్రపుకొత్తూరు: ముకుందకు ఆర్థిక సాయం చేస్తున్న సేవా సమితి సభ్యులు

కిడ్నీ బాధితుడికి చేయూత

వజ్రపుకొత్తూరు: సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన కంబల ముకుంద కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి సభ్యులు బాధితునికి రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కిడ్నీల మార్పిడికి రూ.8 లక్షలు అవుతోందని వైద్యులు చెప్పడంతో యువతరం సభ్యులు తమవంతుగా సాయం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు చింత మురళి, కార్యదర్శి గౌరకల అశోక్, సభ్యులు కంబాల వల్లభరావు, విఘ్నేష్, సోమేశ్వరరావు, కుసురాజు, పాలిన నూకరాజు ఉన్నారు.

600 మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాం

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఆరు వందల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించామని అమలకుడియా పంచాయతీ సర్పంచ్ కొర్ల శిరీషా తెలిపారు. కాశీబుగ్గలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. అక్షర కళాశాల వేదికగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యావంతులను ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియ చేపట్టమన్నారు. తమ సేవలను మెచ్చి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అభినందించినట్టు చెప్పారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు



మోదుగులపుట్టి వద్ద రోడ్డు విస్తరణ పనులు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వజ్రపుకొత్తూరు మండలం కేంద్రం నుంచి పలాస మండలం రేగులపాడు వరకు రహదారి విస్తరణ జరుగుతోంది. ఈ పనులకు 30 కోట్ల రూపాయలను ఆర్‌అండ్‌బీ శాఖ మంజూరు చేసింది. పర్లాఖిమిడి నుంచి పలాసకు అత్యధికగా వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని సింగిల్‌లైన్‌గా ఉన్న రోడ్డును డబుల్‌లైన్‌గా మారుస్తున్నారు. అవసరమైన చోట కల్వర్టులను నిర్మిస్తున్నారు.

కాలంచెల్లిన విద్యుత్ తీగలు!



కంచిలిలో వేలాడుతున్న తీగలు

• తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు

కంచిలి: మండల కేంద్రం కంచిలితోపాటు పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల తీగలు, కండక్టర్లకు కాలం చెల్లడంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్నపాటి గాలి వీచినా, తీవ్రమైన ఎండ వేడిమికి సైతం తీగలు తెగిపోవడం, కండక్టర్లు మరమ్మతులకు గురౌతున్నాయి. ఏటా వీటి నిర్వహణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా చేయడం లేదనే వాదన వినియోగదారుల నుంచి వినిపిస్తోంది. ఎక్కడైనా సమస్య తలెత్తినప్పుడు తాత్కాలికంగా మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం తప్ప పూర్తిస్థాయిలో పాత తీగలను మార్చిన పరిస్థితి లేదంటున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం కంచిలిలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఎప్పటికప్పుడు లైన్లు ట్రిప్ అవ్వడం, కండక్టర్ల వద్ద సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేత్రపర్వంగా చక్రధరుని డోలోత్సవాలు



కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక సుప్రభాత సేవ, గరుడవాహన సేవ, నిత్యదర్శనాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల కృష్ణారావు, కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత స్వరఝరి ప్రేక్షకుల్ని అలరించింది. డాక్టర్ సుచిత్ర హోళ్ల గాత్రానికి మావుదూరు సత్యన్నారాయణశర్మ వయెలిన్‌తో, డాక్టర్ బి.సత్యవరప్రసాద్ మృదంగంతో, మావుదూరి సూర్యప్రసాద్ ఘటంతో వాయిద్య సహకారాన్ని అందించారు.



కాశీబుగ్గ: చినబాడంలో ప్రచారం చేస్తున్న చైర్మన్ గిరిబాబు, నాయకులు



పలాస: అల్లుకోలలో ప్రచారం చేస్తున్న నాయకులు



మందస: ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు



కంచిలి: ప్రచారం చేస్తున్న నరేష్‌కుమార్ అగర్వాలా తదితరులు

సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం

• తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులకు విజ్ఞప్తి

టెక్కలి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు కోరారు. తిర్లంగి పంచాయతీలో ఆదివారం ప్రచారం చేపట్టారు. పట్టభద్రులను మర్యాద పూర్వకంగా కలిసి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ ఎస్.మౌనిజ, ఎంపీటీసీ సభ్యుడు బి.దేవయాని, నాయకులు బి.ఉదయ్, బి.రాజేష్, డి.కిరణ్, సీహెచ్ జీవన్, బి.బలుసాకు ఉన్నారు.

• టెక్కలి మేజర్ పంచాయతీలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కోదండరామవీధి, శ్రీరామాకాలనీ, బీసీ కాలనీ తదితర వీధుల్లో పట్టభద్రులను కలిశారు. సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. గ్రామ సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి ఎస్.మోహన్, ఎంపీటీసీ సభ్యురాలు సత్తారు ఉషారాణి, నాయకులు జి.అప్పలరెడ్డి, బి.హరి, డి.రంగబాబు, సీహెచ్.జీవన్, సిహెచ్.బాలకృష్ణ, టి.లోకేష్, డి.శ్రీనివాస్, జి.మోహన్‌రెడ్డి, కె.కామేష్, ఎస్.కృష్ణ, అనంతయ్య, పి.శ్రీను, ఎ.రవికుమార్, ఎ.రాహుల్, డి.కామన్న, డి.గురివినాయుడు, బి.రాజేష్ పాల్గొన్నారు.

మందస: సుధాకర్ విజయం సాధించేలా పట్టభద్రులు కృషి చేయాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు కోరారు. పలు గ్రామాల్లో పర్యటించారు. మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, క్లస్టర్ ఇన్‌చార్జి బాడ జగన్నాయకులు, నాయకులు రట్టి లింగయ్య, మట్ట షణ్ముఖరావు, తెలుకల డొంబురు, పులారి తవిటయ్య ఉన్నారు.

కంచిలి: సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ) కోరారు. ఈ మేరకు గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు ఎన్నిక కేవలం లాంఛనమేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు, నాయకులు కొత్తకోట శేఖర్, డొక్కరి నారాయణ ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు కోరారు. కొండవూరు, పి.ఎం.పురం, గోవిందపురం, కంబలరాయుడుపేట, ఉద్దాన గోపినాథపురం,రెయ్యిపాడు తదితర గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచార కరపత్రాన్ని అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్‌లు కొల్లి భాస్కరరావు, కర్ని శ్రీను, బత్సల ధర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, నాయకులు మద్దిల హరినారాయణ, తిరుపతి ఉన్నారు.

పలాస: అల్లుకోల, లొద్దబద్ర, తర్లాకోట తదితర పంచాయతీల్లో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ ప్రచారం చేశారు. నాయకులు మచ్చ ధనరాజు, చింతాడ మాధవరావు, దువ్వాడ రవి, కొర్ల సంతు ఉన్నారు.

సీతారాం సుధాకర్‌ను గెలిపించండి

కాశీబుగ్గ: సుధాకర్‌కు మద్దతుగా మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 5, 6, 7, 21వ వార్డుల్లో నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు శిష్టు గోపి, బడగల బళ్లయ్య, బళ్ల శ్రీనివాసరావు, రోణంకి శ్రీనివాసరావు, దువ్వాడ సత్యవతి, డబ్బీరు నాగు ఉన్నారు.

• బీజేపీ అభ్యర్థి పి.వి.ఎస్.మాధవ్ తరపున ఆ పార్టీ నాయకులు పలాస పట్టణంలో ప్రచారం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలక్రిష్ణయాదవ్, అమ్మ ఆశ్రమం వ్యవస్థాపకులు రామన్న స్వామి పాల్గొన్నారు.

సోంపేట: సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద సోంపేట, పలాసపురం, బుసాబద్ర పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సుంకిడి సర్పంచ్ శిలగాన భాస్కరరావు, పాలాకి వెంకటరమణ, దుమ్ము ఢిల్లీరావు, బతకల సతీష్, గోకర్ల ధర్మారావు, మర్ల శంకరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ బోర పుష్ప కోరారు. బాలకృష్ణాపురం, లక్ష్మీపురం, దేవులమద్రి, కేదారిపురం, ముచ్చింద్ర, బెన్నుగాపేట గ్రామాల్లో పార్టీ నాయకులతో పట్టభద్రులను కలసి ఓటు వేయాలంటూ కరపత్రాలను అందజేశారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, సర్పంచ్ నీలాపు సారథిరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరె పాల్గొన్నారు.



టెక్కలి: తిర్లంగి గ్రామంలో ప్రచారం చేస్తున్న చింతాడ మంజు తదితరులు

కోటబొమ్మాళి: సుధాకర్ తరపున వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి కొత్తపేటలోని ఇందిరమ్మకాలనీ, తారకరామ కాలనీలో ప్రచారం నిర్వహించారు. నాయకులు డి.రామకృష్ణ, మక్క నారాయణరావు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: ఎన్నిక ప్రచారం చేస్తున్న నాయకులు



సోంపేట: బుసాబద్రలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



ఇచ్ఛాపురం రూరల్: పట్టభద్రుడికి కరపత్రం అందజేస్తున్న ఎంపీపీ పుష్ప



కోటబొమ్మాళి: కొత్తపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు